సంక్రాంతి నాటికి 200 కొత్త డీజిల్ బస్సులు

- వారంలో అందుబాటులోకి 50 బస్సులు
- టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

బస్సుభవన్‌లో బస్సును పరిశీలిస్తున్న టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి నాటికి 200 కొత్త డీజిల్ బస్సులను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్ ప్రాంగణంలో కొత్త లహరి స్లీపర్ కమ్ సీటర్, రాజధాని ఏసీ, ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆయన పరిశీలించారు. త్వరలోనే 2 వేలకు పైగా కొత్త బస్సులు అందుబాటులోకి తీసుకరానున్నట్టు పేర్కొన్నారు. హైదరాబాద్ సిటీలో 540, తెలంగాణలో ఇతర ప్రాంతాలకు 500 ఎలక్ట్రిక్ వాహనాలను వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రణాళికలు రూపొందించామని వివరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ రవీందర్, ఈడీ కృష్ణకాంత్, సీఎంఈ రఘునాథరావు, సీటీఎం జీవనప్రసాద్ పాల్గొన్నారు.

డబుల్ డ్యూటీ వేతనాల పెంపు

మహాలక్ష్మి పథకంతో డ్రైవర్లు, కండక్టర్లపై అదనపు పని ఒత్తిడి పడుతున్నట్టు గుర్తించిన సంస్థ, డబుల్ డ్యూటీ చేసే డ్రైవర్లు, కండక్టర్ల రోజువారీ అలవెన్స్ (డీడీ వేతనం)ను పెంచింది. గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో రెగ్యులర్ డ్రైవర్లకు రూ.740 నుంచి రూ.900కు, రెగ్యులర్ కండక్టర్‌కు రూ.700 నుంచి రూ.850కు, కాంట్రాక్ట్ డ్రైవర్‌కు 590 నుంచి 720కు, కాంట్రాక్ట్ కండక్టర్‌కు 510 నుంచి 720కు పెంచారు. ఇతర రీజియన్‌లలో రెగ్యులర్ డ్రైవర్లకు రూ.600 నుంచి రూ.730కు, కండక్టర్లకు రూ.530 నుంచి రూ.650కు, కాంట్రాక్ట్ డ్రైవర్లకు రూ.480 నుంచి 590కు, కాంట్రాక్ట్ కండక్టర్లకు రూ.420 నుంచి రూ.510కు పెంచారు.

ఆర్టీసీకి అద్దె బస్సులు కావలెను

- ఉచిత ప్రయాణంతో పెరిగిన రద్దీ
- బస్సులు సమకూర్చేందుకు సంస్థ కీలక నిర్ణయం

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీకి అర్జెంటుగా అద్దె బస్సులు కావాలని సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. ఆసక్తి ఉన్న వారు బస్సులు అద్దెకు ఇవ్వొచ్చని సూచించింది. మహిళల ఉచిత ప్రయాణ ప్రభావం ఆర్టీసీపై పడింది. మహాలక్ష్మీ పథకం ప్రారంభమైన రోజు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భారీగా ప్రయాణికుల సంఖ్య పెరిగింది. ఈ క్రమంలో పలు రూట్లలో చాలినంత సర్వీసులు లేక ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. పలు ప్రాంతాల నుంచి బస్సులు సరిపోవడం లేదని ఫిర్యాదులు అందుతుండగా, అద్దె బస్సులు తీసుకునేందుకు సంస్థ నిర్ణయించింది.

గ్రేటర్ పరిధిలో..

ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, సిటీ సబర్బన్, సిటీ మఫిసిల్ బస్సులు కావాలని ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. ఆసక్తి ఉన్న వారు https://tsrtc.telangana.gov లేదా 9100998230ను సంప్రదించాలని కోరింది. గ్రేటర్ హైదరాబాద్‌లో నడిపేందుకు అద్దె బస్సుల కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. బస్సు నమూనా, కలర్, సీట్లు తదితర అంశాలతో యజమానులు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

ఏపీలో మరో కొత్త రాజకీయ పార్టీ

'జై భారత్ నేషనల్' పార్టీని ప్రకటించిన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఏపీలో నూతన రాజకీయ పార్టీ ఏర్పాటైంది. సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ 'జై భారత్ నేషనల్' పేరుతో కొత్త పార్టీని శుక్రవారం విజయవాడలో ప్రకటించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకపోవడమే నిరుద్యోగానికి ప్రధాన కారణమని, దానిని తీసుకొచ్చేందుకు పుట్టిందే జై భారత్ నేషనల్ పార్టీ అని లక్ష్మీనారాయణ వెల్లడించారు.గత ఎన్నికల్లో పోటీ తర్వాత మరింత స్ఫూర్తితో పనిచేశానని, అన్నివర్గాల ప్రజలను కలిసి అభిప్రాయాలు తీసుకున్నట్టు వివరించారు. రాజకీయాలు అంటే మోసం కాదని, సుపరిపాలన అని పేర్కొన్నారు. 'వీళ్లు తిన్నారని వాళ్లు.. వాళ్లు తిన్నారని వీళ్లు విమర్శించుకుంటున్నారు. ఎవరూ అవినీతికి పాల్పడలేని వ్యవస్థను తీసుకొచ్చేందుకే పార్టీ స్థాపించాను.. అభివృద్ధితో అవసరాలు తీర్చేందుకు, బానిసత్వాన్ని రూపుమాపేందుకు పుట్టిందే జై భారత్ నేషనల్ పార్టీ' అని లక్ష్మీనారాయణ తెలిపారు.

సింగరేణి బరిలో టీబీజీకేఎస్

- సింగరేణి సంస్థను కాపాడింది కేసీఆరే
- టీబీజీకేఎస్ విజయం సాధిస్తేనే కార్మికులకు న్యాయం జరుగుతుంది
- కార్మికులు ఆత్మసాక్షిగా ఆలోచించి ఎన్నికల్లో బాణం గుర్తుకు ఓటేయాలి
- సంస్థ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపు

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) పోటీ చేస్తుందని ఆ సంఘం గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం సింగరేణి సంస్థ కోసం, కార్మికుల సంక్షేమం కోసం చేసిన పనులను చూసి కార్మికులు ఆత్మసాక్షిగా ఆలోచించి ఓటేసి టీబీజీకేఎస్ సంఘాన్ని గెలిపించాలని పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థను కేసీఆర్ కాపాడారని, లాభాలబాట పట్టించారని, టీబీజీకేఎస్ కార్మికుల హక్కులను సాధించిందని పునరుద్ఘాటించారు. కార్మికుల గొంతుక టీబీజీకేఎస్ బాణం గుర్తుపై ఓట్లేసి భారీ మెజారిటీతో గెలిపించాలని సింగరేణి కార్మికులకు విజ్ఞప్తిచేశారు.

డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే

బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు 20 వేల డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చి యువతకు ఉపాధి కల్పించిందని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. డిపెండెంట్ ఉద్యోగం వద్దనుకుంటే ఆ కుటుంబానికి రూ.25 లక్షలు చెల్లించాలన్న ఉదారమైన నిర్ణయాన్ని కేసీఆర్ తీసుకున్నారని తెలిపారు. కోల్ ఇండియా సంస్థలో సైతం లేని విధంగా కారుణ్య నియామకాల ద్వారా సింగరేణిలో మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని వివరించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సింగరేణి నికర లాభాల్లో కార్మికులకు భారీ మొత్తంలో వాటాలను పంచారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడిననాటికి లాభాల్లో కార్మికులకు వాటా కేవలం 18% ఉండగా, 32 శాతానికి పెంచారని గుర్తుచేశారు. కార్మికుల తల్లిదండ్రులకు కార్పొరేట్ దవాఖానల్లో ఉచితం వైద్య సౌకర్యం కల్పించారని, సొంత ఇల్లు నిర్మించుకునే వారికి రూ.10 లక్షల రుణం వరకు సంస్థనే వడ్డీ భరించడం, ఐఐటీ, ఐఐఎం వంటి సంస్థల్లో చదువుకునే కార్మికుల పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి విప్లవాత్మక, కార్మిక సంక్షేమ నిర్ణయాలను అమలుచేశారని వివరించారు.

టీబీజీకేఎస్ గెలుపు సింగరేణి కార్మికుల జీవితాలకు మలుపు

కార్మికుల కోసం గతంలో ఎప్పుడూ లేనన్ని సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి సింగరేణిని కష్టాల నుంచి కాపాడిన బీఆర్ఎస్ అనుబంధ సంఘం టీబీజీకేఎస్‌ను ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కవిత పిలుపునిచ్చారు. టీబీజీకేఎస్‌ను గెలిపించుకుంటేనే కార్మికులకు న్యాయం జరుగుతుందని, కార్మికుల పక్షాన నిలబడే ఏకైక సంఘం టీబీజీకేఎస్ అని పేర్కొన్నారు. సంఘం నాయకత్వ బాధ్యతల్లో యువతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. గత పదేండ్లలో ఒక్క సమ్మె కూడా చేయనవసరం లేకుండా అన్ని డిమాండ్లు సాధించుకున్నామని తెలిపారు.

భద్రాద్రి జిల్లా భద్రాచలం పట్టణ పరిధిలోని గోదావరి తీరంలో హంస వాహనంపై విహరిస్తున్న శ్రీసీతారామచంద్రస్వామి

నేత్రపర్వంగా సీతారాముల జలవిహారం

ఖమ్మం, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): జగములను ఏలే జగదాభిరాముడు సీతాలక్ష్మణ హనుమాన్ సమేతుడై సర్వాలంకృతమైన హంస వాహనంపై గోదావరి నదీతీరంలో జలవిహారం చేశాడు. వేద మంత్రోచ్చరణలు ప్రతిధ్వనిస్తుండగా.. మంగళవాద్యాలు మోగుతుండగా, మిరుమిట్లు గొలిపే పటాకుల మెరుపుల మధ్య ఈ సంబురం సాగింది. వేడుకను చూస్తూ భక్తులు ఆనంద పరవశులయ్యారు. భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి సన్నిధిలో జరుగుతున్న ముక్కోటి ఏకాదశి వైకుంఠ అధ్యయనోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గౌతమీ తీరంలో తెప్పోత్సవ వేడుక జరిగింది. వేడుకలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల, భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, ఆలయ ఈవో రమాదేవి పాల్గొన్నారు. అలాగే భద్రాచలం రామాలయానికి అనుబంధ ఆలయమైన పర్ణశాల రామాలయ సన్నిధిలోనూ తెప్పోత్సవ వేడుకలు జరిగాయి. ముక్కోటి ఏకాదశి వైకుంఠ అధ్యయనోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున భద్రాద్రి రామయ్య.. ఆలయంలోని ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కేంద్ర పన్నుల వాటా 1533.64 కోట్లు

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): కేంద్ర పన్నుల్లో వాటా కింద తెలంగాణకు రూ.1533.64 కోట్లను కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసింది. దేశంలోని 28 రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలకు పన్నుల్లో వాటా కింద రూ.72961.21 కోట్లు విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. పండుగను దృష్టిలో పెట్టుకుని నిధులు పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నది. ఈ విడత జనవరి 10న తన వాటాను విడుదల చేస్తారు. ఏపీకి రూ.2952.74 కోట్లు, కర్ణాటకకు 2660.88 కోట్లు, కేరళకు 1404.50 కోట్లు, తమిళనాడుకు 2976.10 కోట్లు దక్షిణాది 5 రాష్ట్రాలకు 11,527.86 కోట్లు విడుదల చేసింది.

పెండింగ్ చలాన్లపై బంపర్ ఆఫర్

- భారీ రాయితీ ప్రకటించిన పోలీసుశాఖ
- టూవీలర్లపై 80%, ఫోర్ వీలర్లకు 60%
- రూ.2 కోట్ల చలాన్ల వసూలుకు యత్నం

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వాహనదారులకు పోలీసుశాఖ పెండింగ్ చలాన్లు తక్షణమే చెల్లించేందుకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. ద్విచక్ర వాహనాలకు 80%, ఆటోలు, ఫోర్ వీలర్లకు 60%, ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లపై 90 % రాయితీ ఇచ్చింది. భారీ వాహనాలపై 50 % రాయితీ ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.2 కోట్ల పైగా చలాన్లు పెండింగ్‌లో ఉండటంతో పోలీసుశాఖ ఈ నిర్ణయం తీసుకొన్నది. ఈ నెల 26 నుంచి ఈ డిస్కౌంట్ అందుబాటులో ఉంటుందని పోలీసుశాఖ శుక్రవారం తెలిపింది. గత ఏడాది ఇలాగే రాయితీ ప్రకటించడంతో 45 రోజుల వ్యవధిలోనే ఏకంగా రూ.300 కోట్ల వరకు చలాన్ల రుసుము వసూలైంది. ఇదే తరహాలో మరోమారు రాయితీలు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే వెలువడనున్నాయి. హైదరాబాద్ నగరంలోని మూడు కమిషనరేట్లుతోపాటు రాష్ట్రంలోని ఇతర కమిషనరేట్లు, జిల్లా ప్రధాన కార్యాలయాలు మొదలు చిన్న పట్టణాల్లోనూ చలానాలు విధిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడం, ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో ఉల్లంఘనలకు పాల్పడేవారిని గుర్తించి చలానాలు విధిస్తున్నారు. గత నెలాఖరు నాటికి పెండింగ్ చలాన్‌ల సంఖ్య మళ్లీ రూ.2 కోట్లకు చేరుకోవడంతో మరోమారు రాయితీ ప్రకటించారు. నిర్ణీత వ్యవధిలో చలానాలను చెల్లించేవారికే ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపారు.

తెలంగాణలో చలి పంజా

- సింగిల్ డిజిట్‌కు పడిపోయిన ఉష్ణోగ్రత

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగిపోయింది. ఈశాన్యం నుంచి బలంగా గాలులు వీస్తుండటంతో వారం పది రోజులుగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఇండ్ల నుంచి బయటికి వెళ్లాలంటే జనం వణికిపోతున్నారు. ఉదయం 9 గంటల వరకు మంచు వీడటం లేదు. పలు జిల్లాల్లో రాత్రి సమయాల్లో తొమ్మిది గంటల తర్వాత వాహనాలు రోడ్లపై రావడం లేదు. పలు జిల్లాల్లో ఏకంగా 6.6 డిగ్రీల సెల్సియస్ కన్నా తక్కువగా నమోదవుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై తీవ్రంగా ఉండగా, హైదరాబాద్‌లో 12.5 డిగ్రీలు నమోదైంది. తెలంగాణలోని పలు జిల్లాలలో రాత్రి ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే దిగువకు పడిపోయాయి. రానున్న రోజుల్లోనూ రాత్రి ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉన్నదని తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ తెలిపింది. నగరంలో కొన్ని ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కంటే తక్కువగా రికార్డ్ అవుతుండగా, హైదరాబాద్‌లో 11.9 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు పేర్కొన్నది.

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్

కాంగ్రెస్ అబద్ధపు హామీలపై చర్చపెట్టాలి

- నిరుద్యోగ భృతిపై మాట మార్చిన సర్కారు
- కార్యకర్తలతో మాజీ ఎంపీ వినోద్‌కుమార్

తిమ్మాపూర్ రూరల్, డిసెంబర్ 22: కాంగ్రెస్ అబద్ధపు హామీలపై గ్రామాల్లో చర్చ పెట్టాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆరు గ్యారంటీల అమలు కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి వినోద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే తొలి క్యాబినెట్ మీటింగ్‌లోనే హామీలను నెరవేరుస్తామని తప్పుడు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ సర్కారును ఎండగట్టాలని సూచించారు. అధికారంలోకి వచ్చాక రైతుబంధు, నిరుద్యోగ భృతిపై మాట మార్చారని విమర్శించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ సాధించిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు. సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి గత పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన బండి సంజయ్.. నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో వారి పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ నయా పైసా తేలేదని వినోద్‌కుమార్ విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గడ్డం నాగరాజు, గూడేల్లి తిరుపతి, సిద్ధం వేణు, రావుల రమేశ్, కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నారా లోకేశ్‌పై ఏసీబీ కోర్టులో మెమో దాఖలు

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌పై విజయవాడ ఏసీబీ కోర్టులో సీఐడీ మెమో దాఖలు చేసింది. ఏపీ మాజీ సీఎం చంద్రబాబుపై కేసులు బనాయించి, రిమాండ్ విధించడం తప్పని లోకేశ్ పలు మీడియా చానళ్ల ఇంటర్వ్యూల్లో వ్యాఖ్యానించారని సీఐడీ పేర్కొన్నది. టీడీపీ హయాంలో పనిచేసిన ఉన్నతాధికారులు చంద్రబాబుపై వివిధ కేసుల్లో న్యాయమూర్తి ఎదుట వాంగ్మూలాలు ఇవ్వడాన్ని లోకేశ్ తప్పుపట్టారని, రెడ్ బుక్‌లో అధికారుల పేర్లు నమోదు చేశానని, వారి సంగతి తేలుస్తానంటూ హెచ్చరించారని పేర్కొన్నది. సాక్షులని బెదిరించి కేసు దర్యాప్తును పక్కదారి పట్టించాలని లోకేశ్ ఉద్దేశంగా ఉన్నదని పేర్కొన్నది. గతంలో లోకేశ్‌కు జారీచేసిన 41ఏ నోటీసుల్లో పేర్కొన్న షరతులకు విరుద్ధమని సీఐడీ వెల్లడించింది.

దైవదర్శనానికి వెళ్తూ మృత్యు ఒడికి..

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం

- ఇద్దరికి తీవ్రగాయాలు.. కారు, లారీ ఢీ
- మృతులంతా ఏటూరునాగారం వాసులే..
- హనుమకొండ జిల్లాలో ఘటన

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మంతెన భరత్, మంతెన చందన, మంతెన శంకర్, మంతెన కాంతయ్య, రేణుక (ఫైల్)

ఎల్కతుర్తి/ఏటూరునాగారం, డిసెంబర్ 22: దైవదర్శనానికి వెళ్తూ ఐదుగురు మృత్యుఒడిలోకి వెళ్లిన దుర్ఘటన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేట సమీపంలో గురువారం అర్ధరాత్రి తర్వాత చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ములుగు జిల్లా ఏటూరునాగారానికి చెందిన అన్నదమ్ముల సంతానమైన మంతెన కాంతయ్య (70), ఆయన భార్య రేణుక (55), కుమార్తె చందన (14), మంతెన శంకర్ (60), ఆయన భార్య శ్రీదేవి, కుమారులు భార్గవ్, భరత్ (29) కలిసి వేములవాడలో దైవదర్శనానికి కారులో గురువారం రాత్రి 9 గంటలకు బయలుదేరి వెళ్లారు. అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో కారు పెంచికలపేట సమీపంలోకి రాగానే ఎదురుగా గుజరాత్ నుంచి ఏలూరు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొన్నది. దీంతో కారు పూర్తిగా నుజ్జునుజ్జయి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మంతెన శంకర్, ఆయన కొడుకు భరత్, మంతెన కాంతయ్య, అతని కూతురు చందన అక్కడికక్కడే మృతి చెందగా, చికిత్స పొందుతూ రేణుక మృతిచెందింది. వెనుక సీటులో కూర్చున్న రేణుకతోపాటు శ్రీదేవి, భార్గవ్‌కు తీవ్రగాయాలై కారులోనే ఇరుక్కుపోయారు. విషయం తెలుసుకున్న ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై గోదారి రాజుకుమార్ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను బయటకు తీశారు. 108లో బాధితులను ఎంజీఎం దవాఖానకు తరలించారు. వారిలో రేణుక చికిత్స పొందుతూ కన్నుమూసింది.

మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం పాలైన ఘటనపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆమె వైద్యులను ఆదేశించారు.

ఆర్మూర్‌లో కిలోన్నర బంగారు నగల చోరీ

ఆర్మూర్ టౌన్, డిసెంబర్ 22: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో శుక్రవారం భారీ చోరీ జరిగింది. కారులోంచి రూ.90 లక్షల విలువైన కిలోన్నర బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. పట్టణంలోని మహాలక్ష్మి కాలనీలో నివసించే డాక్టర్ ఈశ్వర్ చంద్ర రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్. ప్రస్తుతం పాత పోలీస్ స్టేషన్ వద్ద క్లినిక్ నిర్వహిస్తున్నారు. పట్టణంలోని కో-ఆపరేటివ్ బ్యాంకు లాకర్‌లో ఉన్న కిలోన్నర బంగారు ఆభరణాలను అవసరం నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం తీసుకున్నారు. బ్యాంకు నుంచి కారులో ఇంటికి బయల్దేరిన ఆయన.. మార్గమధ్యంలో ఉన్న మహాలక్ష్మి మందిరం వద్ద కారు ఆపి దర్శనం కోసం గుడిలోపలికి వెళ్లారు. అనంతరం బయటికి వచ్చిన ఆయనకు కారులో ఉంచిన బంగారు ఆభరణాల బ్యాగు కనిపించలేదు. బ్యాగు అపరహరణకు గురైందని గ్రహించిన ఈశ్వర్‌చంద్ర.. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఒకేసారి బ్యాంకు లాకర్ నుంచి కిలోన్నర బంగారు ఆభరణాలు తీసుకురావడం, ఆ తర్వాత దైవదర్శనం కోసం ఆలయంలోకి వెళ్లడం తదితర అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. చోరీ జరిగిన విషయం తెలియగానే సీపీ ఆదేశాల మేరకు అదనపు సీపీ జయరాం ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆర్మూర్ ఏసీపీ, సీఐతోపాటు జిల్లాలోని టాస్క్‌ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో పట్టణంలో గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు వేలిముద్రల నిపుణులు కారును పరిశీలించి ఆధారాలను సేకరించారు.

భార్య, అత్త వేధింపులతో భర్త ఆత్మహత్య

ధర్మారం, డిసెంబర్ 22: కాపురానికి రావాలని కోరినందుకు భార్య, అత్త వేధించడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కటికెనపల్లిలో జరిగింది. కటికెనపల్లికి చెందిన ఎత్తరి రాజవ్వ- రాజయ్య కొడుకు నరేశ్ (25)కు ఆరు నెలల క్రితం జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఉప్పుమడకకు చెందిన శైలజతో వివాహం జరిగింది. కొంత కాలం అన్యోన్యంగా ఉన్న ఈ దంపతులు.. ఇటీవల విభేదాలొచ్చి శైలజ పుట్టింటికి వెళ్లింది. కాపురానికి రావడానికి ససేమిరా అంది. పెద్ద మనుషులు పంచాయితీ పెట్టి సర్దిచెప్పినా.. సమస్య ఇంకా పెద్దదైంది. తన భార్యను పంపించాలని నరేశ్ కోరగా అత్త హారిక, భార్య మేనమామ పల్లపు నర్సయ్య, కుల పెద్దమనిషి కోట జంపయ్య కలిసి మానసికంగా వేధించి అవమానించారు. తాను కాపురానికి రానని, వేరే వ్యక్తిని పెండ్లి చేసుకుంటానని శైలజ నరేశ్‌కు తేల్చిచెప్పింది. దీంతో మనస్తాపానికి గురైన నరేశ్ గురువారం ఉదయం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం కరీంనగర్ దవాఖానకు తరలించారు. సాయంత్రం పరిస్థితి విషమించి మరణించినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం మృతుడి తల్లి రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరేశ్ భార్య శైలజ, అత్త హారిక, మరో ఇద్దరు వ్యక్తులు నర్సయ్య, జంపయ్యపై కేసు నమోదు చేశారు.

డిపాజిట్ల పేరుతో 1.50 కోట్లు స్వాహా

- సత్తుపల్లి పట్టణంలోని ప్రైవేటు బ్యాంక్‌లో ఘరానా మోసం
- అసిస్టెంట్ మేనేజర్ నిర్వాకం.. ఆందోళనలో ఖాతాదారులు

సత్తుపల్లి టౌన్, డిసెంబర్ 22: సత్తుపల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు బ్యాంకులో ఘరానా మోసం వెలుగుచూసింది. ఓ ప్రైవేటు బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్.. ఎక్కువ మొత్తం జమ చేసిన ఖాతాదారులను గుర్తించాడు. గత ఆర్థిక సంవత్సరం చివరలో ఖాతాల్లోని సొమ్మును డిపాజిట్ చేస్తే వడ్డీతో తిరిగి జమ చేస్తామని నమ్మించాడు. నమ్మిన కొందరు చెక్కులు ఇచ్చారు. వాటిని ప్రశాంత్ మరో ఉద్యోగి భార్య ఖాతాలో వేయించాడు. ఇలా ఆరు నెలల నుంచి కొద్దికొద్దిగా నగదు డ్రా చేశాడు. చెప్పినవన్నీ జరగకపోవడంతో ఖాతాదారులు నిలదీశారు. తర్వాత ప్రశాంత్ సెలవుపై వెళ్లాడు. ఇలా ప్రశాంత్ సుమారు రూ.1.50 కోట్ల వరకు సొమ్మును మళ్లించాడు. బ్యాంక్ అధికారులు ప్రశాంత్ నుంచి రూ.50 లక్షల వరకు రికవరీ చేసి కొందరు ఖాతాదారులకు సొమ్ము సెటిల్ చేశారు. మిగిలిన ఖాతాదారులను బ్యాంక్‌కు రప్పించి విషయం బయటికొస్తే.. బ్యాంక్ పేరు దెబ్బ తింటుందని, ఎవరూ బయటకు వెల్లడించవద్దని, తమ సొమ్ము సెటిల్ చేస్తామని హామీ పత్రాలను ఇచ్చి బుజ్జగించారు. ఇంత జరుగుతున్నప్పటికీ సంబంధిత ఉద్యోగిపై బ్యాంకు ఉన్నతాధికారులు పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.

మావోయిస్టుల భారత్‌బంద్ పాక్షికం

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా మావోయిస్టు పార్టీతో పాటు సానుభూతి పనులపై సైనిక దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మావోయిస్టులు శుక్రవారం ఇచ్చిన భారత్‌బంద్ పాక్షికంగా కొనసాగింది. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో చెదురుముదురు ఘటనలు జరిగాయి. మావోయిస్టుల బంద్ నేపథ్యంలో భద్రతా బలగాలు అలర్ట్ అయ్యాయి. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఏపీ, మహారాష్ట్ర సరిహద్దుల్లో భారీ కూంబింగ్ చేపట్టాయి. దండకారణ్యాన్ని జల్లెడ పడుతున్నాయి. కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం పైడిగూడెంలో సెల్‌ఫోన్ టవర్‌ను తగలబెట్టేందుకు మావోయిస్టులు ప్రయత్నించారు. అక్కడక్కడా భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని కరపత్రాలు వదిలారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఏజెన్సీలోని వీరాపురంలో వాహనాలకు నిప్పుపెట్టారు. ఏపీలోని గన్నవరం డిపో బస్సులోని ప్రయాణికులు, డ్రైవర్‌ను దించి, బస్సు తగులబెట్టారు. ఛత్తీస్‌గఢ్ జగదల్‌పూర్‌లో పలు చోట్ల వాహనాలను మావోయిస్టులు దహనం చేశారు.